క్లుప్తంగా

సస్యరక్షణలో మెలకువలు పాటించాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న డాక్టర్ రామకృష్ణారావు

మిడుతూరు: సస్యరక్షణలో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఏరువాక కేంద్రం ప్రిన్సిపాల్, శాస్త్రవేత్త డాక్టర్ రామకృష్ణా రావు తెలిపారు. సోమవారం మండల కేంద్రం సమీపంలో సాగైన పత్తి పంటను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పత్తి పైరులో రసం పీల్చు పురుగులు, (పచ్చదోమ, తామర పురుగులు), మెగ్నీషియం దాతు లోపాలు గమనించినట్లు చెప్పారు. చీడపీడల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ పీరునాయక్, అగ్రికల్చర్ అసిస్టెంట్ అశోక్, రైతులు డాలు సూరిబాబు, జక్కుల సురేష్, లింగస్వామి, రవి పాల్గొన్నారు.

కౌలు కార్డులతో ప్రయోజనాలు



కార్డులు అందిస్తున్న ఏఓ, వీఆర్ఓలు

మహానంది: కౌలురైతులు సాగు చేసే పంటపొలాలకు కౌలు కార్డులు పొందాలని వ్యవసాయ అధికారి నాగేశ్వరరెడ్డి తెలిపారు. బుక్కాపురంలో సోమవారం కౌలు రైతుల అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యజమాని సంతకంతో పాటు పాసుపుస్తకం, ఆధార్ కార్డు సమర్పించాలన్నారు. కౌలు కార్డు తీసుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. వీఆర్ఓ వెంకటరాముడు, చంద్రమోహన్, క్రిస్టియానమ్మ, ఏఈఓ శ్రీనివాసరెడ్డి, వీహెచ్ఏలు పల్లవి, మౌనిక పాల్గొన్నారు.

బెల్లంఊట ధ్వంసం



నాటుసారా బట్టీలను ధ్వంసం చేస్తున్న సెబ్ అధికారులు

ఆత్మకూరు: మండలంలోని సిద్ధాపురం గ్రామ సమీపంలో ఉన్న అడవిలో సోమవారం ఆత్మకూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి మారుతీరావు ఆధ్వర్యంలో నాటుసారా బట్టీలపై దాడులు నిర్వహించారు. 600 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేసి, 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా సారా తయారు చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

నీటి సమస్య పరిష్కారం

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామ పంచాయతీ మజరా క్రిష్ణారావుపేట గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించినట్లు సర్పంచు వరప్రసాద్ తెలిపారు. సోమవారం బోరు మోటారు వద్ద మరమ్మతు చేయించారు. ఆయన మాట్లాడుతూ మోటారు వద్ద విద్యుత్ తీగ కాలిపోవడంతో కుళాయిలకు నీటి సరఫరా నిలిచిపోయింది. కొత్త వైరు తెచ్చి ఏర్పాటు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించినట్లు ఆయన చెప్పారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

వెలుగోడు: వర్షా కాలంలో విద్యుత్ ప్రమాదాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ ఏఈ రవీంద్రనాయక్ సూచించారు. స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో సోమవారం వినియోగదారులకు, రైతులకు ఆయన సూచనలు ఇచ్చారు. పవర్ కట్ సమయంలో ట్రాన్స్‌ఫార్మర్, ఏబీ స్విచ్‌ల వద్ద సొంతంగా రిపేరీ చేయకూడదన్నారు. వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ స్తంభాలు పడిపోయినా, విద్యుత్ వైర్లు కింద పడి ఉన్నా వెంటనే విద్యుత్‌శాఖ ఏఈ, లైన్‌మెన్‌కు, 1912 టోల్‌ఫ్రీకి ఫోన్ చేయాలన్నారు. మోటార్లు, స్టార్టర్ల వద్ద రబ్బర్ మ్యాట్‌లు ఉపయోగిస్తే ప్రమాదాలు నివారించవచ్చని చెప్పారు. కండెన్సర్లపై ప్లాస్టిక్ పైపులు వేయకూడదని, వినియోగదారులు గృహాల్లో ఉపయోగించే స్విచ్‌లు, హోల్డర్లు ఐఎస్ఐ గుర్తింపు పొందిన పరికరాలను వాడాలన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

కొత్తపల్లి: వ్యక్తిగత, పరసరాల శుభ్రతను పాటిస్తే డయేరియాతో పాటు వివిధ రకాల వ్యాధులను దూరం చేయవచ్చని వైద్యుడు మహమ్మద్ బేగ్ సూచించారు. సోమవారం పాలెంచెరువు గూడెం లోనున్న ఆశ్రమ పాఠశాలలో స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహించారు. కాచి వడగట్టిన నీటిని, వేడిగా ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవడం, భోజనానికి ముందు, మల విసర్జన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రపరచుకోవాలని చెప్పారు. వాంతులు, విరేచనాలు అయిన తర్వాత ఓఆర్ఎస్ ద్రావకాన్ని తాగించి వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. సీహెచ్ఓ బాలకృష్ణ, పీహెచ్ఎన్ అయేషా బేగం, టీబీ సూపర్‌వైజర్ రవికుమార్, సూపర్‌వైజర్ దేవకరుణమ్మ, గుర్రప్ప సరిత పాల్గొన్నారు.

పథకాల ఊసేదీ?

- ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- పెట్టుబడి సాయం కోసం అన్నదాతల ఎదురుచూపు
- నియోజకవర్గ వ్యాప్తంగా 39,295 మంది రైతులు
- ఏడాదికి రూ. 20 వేలు బ్యాంక్ ఖాతాలో జమ చేస్తానన్న చంద్రబాబు
- తల్లికి వందనంపై స్పందన కరువు
- నియోజకవర్గంలో 25,926 మంది విద్యార్థులు



నందికొట్కూరు: 2024 సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన మేనిఫెస్టోపై అసెంబ్లీలో ఊసేలేదు. అధికారంలోకి వచ్చి రెండు నెలలు పూర్తి కావస్తున్న పథకాలపై అసెంబ్లీలో చర్చ కనిపించలేదు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం నియోజకవర్గంలో మే, జూన్ నెలలో కురిసిన వర్షాలకు వరి, మొక్కజొన్న, పత్తి, మినుము, వేరుశనగతో తదితర పంటలు రైతులు సాగు చేశారు. నియోజకవర్గంలోని 39,295 రైతులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రూ. 212.19 కోట్లు అందజేశారు. ప్రస్తుతం వీరంతా ఖరీఫ్‌లో భాగంగా పంటలు సాగు చేశారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు ప్రతి రైతుకు రూ.20వేల ప్రకారం చెల్లించాల్సి ఉన్నా ఇప్పటి వరకు విధి విధానాలు వెల్లడించకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో సీజన్ ప్రారంభానికి ముందే జగనన్న ప్రభుత్వం పెట్టుబడి సాయం మంజూరు చేసేది. అయితే ఈ ఏడాది కేవలం పీఎం కిసాన్ కింద రూ.2వేలు కేంద్రప్రభుత్వం మాత్రమే జమ చేసింది. దీంతో పంటల సాగుకు రైతన్నలు అప్పులు చేయాల్సి వచ్చింది. ప్రభుత్వ సాయం కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు.

తల్లికి వందనం మాటేమిటి?

అమ్మ ఒడి పథకం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటికి ఒక్కరికే ఇస్తున్నారని, తాము అధికారంలోకి వస్తే ఇంట్లో చదువుతున్న పిల్లలందరికీ తల్లికి వందనం పేరుతో రూ. 15 వేల చొప్పున్న ఇస్తామని కూటమి నేతలంతా హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చాక ఎప్పటిలాగే పథకం అమలును పట్టించుకోకపోవడంతో వారి మాటలు నమ్మిన తల్లులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో ప్రస్తుతం 25,324 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి రూ.15వేల చొప్పున ప్రస్తుత ప్రభుత్వం మంజూరు చేయాల్సి ఉంది. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో జగనన్న అమ్మ ఒడి పథకం కింద రూ, 379.860 కోట్లను 25,324 మంది తల్లుల ఖాతాలో జమచేశారు. 2023–24 సంబంధించిన అమ్మఒడి నిధులు ఈ ఏడాది జూన్‌లో విడుదల కావాల్సి ఉన్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

రైతుభరోసా ఊసేత్తకపోతే ఎలా?



ఇప్పటిదాకా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతుభరోసా ఊసేఎత్తకపోతే రైతులు ఎలా పంటలు సాగుచేసుకొంటారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నంత కాలం ఏటా ఖరీఫ్, రబీ పంటల సాగు ప్రారంభదశలోనే పెట్టుబడి సాయంగా పీఎంకిసాన్–రైతుభరోసా మొత్తం బ్యాంకు ఖాతాలో జమ చేసేవారు. చంద్రబాబు సీఎం అయ్యాక రైతులకు పెట్టుబడి సహాయంగా ఇస్తానన్న రూ.20వేల ప్రస్తావనే లేదు. నేను ఆరు ఎకరాల్లో మొక్కజొన్న, మిరప, ఉల్లి పంటలను సాగుచేస్తాను. ఏటా పంటల సాగుకు నాకు ఎకరాకు రూ.30వేల నుంచి రూ.1.50 లక్షల దాకా ఖర్చు అవుతుంది. – **మధు, రైతు, జూపాడుబంగ్లా**

పాలేరువాగుపై వంతెన నిర్మించాలి



మహానంది నుంచి గాజులపల్లె మార్గంలో మూడు కి.మీ. మేర రోడ్డు అధ్వానంగా ఉంది. అడుగుకో గుంత ఉండడంతో భక్తులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంతెన లేకపోవడంతో పాలేరు వాగు ఉధృతికి వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి.ఆ సమయంలో భక్తులు, స్థానికులు మహానంది రావాలంటే నంద్యాల మీదుగా రావాల్సి వస్తుంది. ఈ సమస్య పరిష్కారానికి అవసరమైన రహదారి నిర్మాణానికి నిధులు మంజూరుపై అసెంబ్లీలో ఎమ్మెల్యే చర్చించాలి. – **టి.రామచంద్రుడు, గాజులపల్లె**

ఇవిగో సమస్యలు

- ప్రజాగోడు పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- హామీలు అమలుపై దృష్టి సారించని శ్రీశైలం ఎమ్మెల్యే



సిద్ధాపురం చెరువు

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం ఏర్పడి నెలన్నర దాటినా ప్రజాసమస్యలపై దృష్టి సారించలేదు. కనీసం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సైతం అమలు చేయలేదు. సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. అందులోనైనా ఈ ప్రాంత సమస్యలు, హామీలపై ఎమ్మెల్యే బుడ్డారాజశేఖరరెడ్డి గళమెత్తాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

సమస్యల్లో కొన్ని....

- ఆత్మకూరు మండలంలో సిద్ధాపురం చెరువు నుంచి పంట కాల్వల ద్వారా అన్ని గ్రామాల రైతులకు సాగునీరు అందిస్తామని ఎన్నికల ముందు ఎమ్మెల్యే బుడ్డా హామీ ఇచ్చారు. అలాగే వడ్ల రామాపురం, ఇందిరేశ్వరం గ్రామాలకు కూడా ప్రత్యేక కాలువ ద్వారా సిద్ధాపురం నీటిని మళ్లించి పంటలు పండేలా చూస్తానన్నారు. దీనిని ఆచరణలో పెట్టాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.
- ఆత్మకూరు పట్టణంలో ఏళ్ల తరబడిగా డ్రెయినేజీ సమస్య నెలకొంది. ఈ సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలి.
- పట్టణంలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉంది. సమయానికి నీళ్లు రావు. అధికారంలోకి వస్తే ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అమలుకు చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు వాసులు కోరుతున్నారు.
- వెలుగోడు, బండిఆత్మకూరు మండలాల్లో రహదారుల సమస్య ఉంది. ఓంకారం పుణ్యక్షేత్రానికి సరైన రోడ్డు లేదు. మహానంది–గాజులపల్లెకు వెళ్లే ప్రధాన రహదారిలో పాలేరువాగుపై వంతెన నిర్మించాల్సి ఉంది. ఇదే మండలంలోని అంకిరెడ్డి చెరువు, బసాపురం చెరువులకు ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేసి పంటలకు సాగునీరు అందించాల్సి ఉంది.
- బండిఆత్మకూరు మండలంలోని నారాయణపురం, బి.సి.పాలెం గ్రామాల మధ్య వంతెన నిర్మించాలి. బోధనం, సాకనూరు, పడమటూరు గ్రామాల్లోని కుందూనదిపై వంతెనలను ఏర్పాటు చేయాలి.

హామీలు అమలుకు ఎదురుచూపు

- శ్రీశైలం నియోజకవర్గంలో 36,068 మంది తల్లులు 'తల్లికి వందనం' పథకం అమలు కోసం ఎదురుచూస్తున్నారు. స్కూళ్లు తెరిచి నెలరోజులు దాటినా సాయంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వైఎస్ జగన్ పాలనలో విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే అమ్మఒడి పథకం కింద రూ. 15 వేలు తమ ఖాతాల్లో జమ అయ్యేది అని విద్యార్థుల తల్లుల పేర్కొంటున్నారు.
- ఆత్మకూరు పట్టణంలో 12,976, మండలంలో 11,987, శ్రీశైలంలో 9,111, వెలుగోడులో 18,245, మహానంది మండలంలో 12,851, బండిఆత్మకూరు మండలంలో 16,594 మంది నిరుద్యోగులు ఉన్నారు. వీరంతా ఎన్నికల ముందు కూటమి సర్కారు ప్రకటించిన నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూస్తున్నారు.

ఇద్దరు పిల్లలను బడికి పంపుతున్నాం



రెక్కల కష్టంపై ఆధారపడిన కుటుంబం మాది. ఇద్దరు పిల్లలను బడికి పంపుతున్నాం. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఎంత మంది పిల్లలు చదివితే వారందరికీ తల్లికి వందనం ఇస్తామని చెప్పారు. ఇచ్చిన హామీని నిరాశ పరచకుండా అమలు చేసి మా లాంటి పేదలకు చేదోడుగా నిలవాలి. తల్లికి వందనం వస్తుందని ఎంతో ఆశతో ఉన్నాం. అయితే ఇప్పటి వరకు పథకం గురించి ఎక్కడా మాట్లాడటం లేదు. ఇస్తారో.. లేదో. – **పవిత్ర, మిడుతూరు మండలం**

హామీని నిలబెట్టుకోవాలి



ఎన్నికల ముందు ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటే అందరికీ తల్లికి వందనం పథకం ద్వారా రూ, 15 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. సూపర్ సిక్స్ పథకాలంటూ టీడీపీ నాయకులు ఇంటింటికీ వచ్చి కరపత్రాలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కరికే వస్తుందంటూ ప్రచారం జరుగుతుంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి. – **మమత, కొత్తపల్లి మండలం**

అప్పులు చేసి పంట సాగు



అప్పు చేసి పంట సాగు చేశాం. ఒక ఎకరాకు దాదాపు రూ, 15 వేలు ఖర్చు వస్తుంది. గతంలో పీఎం కిసాన్‌తో పాటు రైతుభరోసా ఒకేసారి వస్తుండేది. దీంతో పెట్టుబడికి ఇబ్బందులు తగ్గేవి. ఇప్పుడు పీఎం కిసాన్ రూ. 2 వేలు మాత్రమే అందడంతో పంట సాగుకు అప్పు చేయాల్సి పరిస్థితి ఏర్పడింది. సీఎం చంద్రబాబు స్పందించి పెట్టుబడి సాయం అందిస్తే బాగుంటుంది. 5 ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. సాగుకు ముందు సాయం చేస్తే మంచిది. – **నారాయణరెడ్డి, చెలిమిళ్ల, పాములపాడు మండలం**

పథకాలపై నోరుమెదపలేదు



అసెంబ్లీలో సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజాప్రతినిధులు సమాధానమివ్వాలి. ఇప్పటి వరకు వాటి గురించి కొంచెం కూడా భరోసానివ్వకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అన్నదాత సుఖీభవ పథకం పేరుతో రైతులకు బ్యాంక్ అకౌంట్లలో రూ.20 వేలు జమ చేయలేదు. నేను మొక్కజొన్న 4ఎకరాలు, వరి రెండు ఎకరాల్లో సాగుచేశాను. ఒక్కొక్క ఎకరాకు రూ, 35 వేల చొప్పున్న ఖర్చు వస్తుంది. ఆ మొత్తం ఇస్తే రైతులకు కొంత వరకు ఊరటినిస్తుంది. – **మొల్ల అస్లాం బాషా, పడమర ప్రాతకోట**

ఆలయంలో గంట చోరీ

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని తూర్పు ప్రాతకోట నాగేశ్వరస్వామి దేవాలయంలోకి గుర్తు తెలియని వ్యక్తులు గంట అపహరించిన ఘటన సోమవారం వెలుగు చూసింది. దక్షిణ భారతదేశంలోని ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రాల్లో పార్వతీ సమేత నాగేశ్వరస్వామి దేవాలయం మహిమాన్వీతమైనదిగా ప్రతీతి. ఆదివారం మధ్యాహ్నం పూజారి సోమన్న ఆలయాన్ని సందర్శించి చూడగా గర్భగుడికి ఎదురుగా వేలాడదీసిన గంట కనిపించలేదని కమిటీ సభ్యులకు తెలిపారు. దీంతో కమిటీ సభ్యులు ముచ్చుమర్రి పోలీసులకు ఉదయం ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. ఇన్‌చార్జ్ ఎస్ఐ గంగయ్య యాదవ్‌ను అడుగగా తమకు ఫిర్యాదు అందలేదన్నారు. కేవలం మౌఖికంగా చెప్పడంతో సిబ్బందిని పంపించామని తెలిపారు.

పంటలను కాపాడుకోండి

జూపాడుబంగ్లా: రైతులు అప్రమత్తంగా ఉండి అధిక వర్షాల బారినుంచి పంటలను కాపాడుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం తాటిపాడు, పారుమంచాల, జూపాడు బంగ్లా రైతుభరోసా కేంద్రాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికవర్షాల వల్ల మొక్కజొన్న, కంది, మినుము, పంటల్లో వేరుకుళ్లు, మచ్చతెగులు వ్యాపించి పంటనష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. వీటి నివారణకు నీటి నిల్వలేకుండా చేసుకోవాలన్నారు. వర్షం తగ్గిన తర్వాత ఎకరాకు 25 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్ వేసుకోవాలని సూచించారు. వేరుకుళ్లు తెగులు వ్యాపిస్తే ఆ మొక్కలను తొలగించాలని చెప్పారు. ఆ తర్వాత పంటపై కాపర్‌ఆక్సీక్లోరైడ్(సీఓసీ) ఎకరాకు 600 గ్రాముల చొప్పున నీటిలో కలుపి మొక్కల మొదళ్లలో పోయాలన్నారు. అనంతరం కొందరికి కౌలుకార్డులు పంపిణీ చేశారు.

ఘనంగా పెద్ద సరిగెత్తు

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామంలో సోమవారం మౌలాలి స్వామి పెద్ద సరిగెత్తు వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, చేరుకొని కందుర్లు నిర్వహించారు. స్వామి వారికి దట్టీలు, పూల షేరాలు సమర్పించారు. సాయంత్రమే స్వామి వారు అగ్ని ప్రవేశం చేసి గ్రామంలో దివిటీల వెలుగులో సవారి నిర్వహించారు. డప్పు వాయిద్యాల మధ్యన యువకులు లయ బద్ధంగా చిందులు వేశారు. ఎస్ఐ అశోక్ పోలీసు బందోబస్తు కల్పించారు.

ఆత్మకూరులో 14.4 మి.మీ.వర్షం

ఆత్మకూరు: మండలంలో సోమవారం వేకువజామున 14.4 మి.మీ. వర్షం కురిసింది. గత పది రోజులుగా మండలంలో విస్తారంగా వర్షాలు కురవడంతో బవనాసి, గుండ్లకమ్మ, సుద్దవాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇప్పటికే వందల ఎకరాల్లో వర్షపునీరు నిలిచి ఉండడంతో మొక్కజొన్న రైతులు ఆందోళన చెందుతున్నారు.

జూపాడుబంగ్లాలో 6.6 మి.మీ. వర్షపాతం

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు కురిసిన వర్షం 6.6 మి.మీ.గా నమోదైనట్లు ఏఎస్ఓ హనుమంతు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గంలోని కొత్తపల్లి మండలంలో అత్యధికంగా 10.6 ఎం.ఎం, అత్యల్పంగా పగిడ్యాలో 5.2 మి.మీ. వర్షపాతం నమోదైందన్నారు. నందికొట్కూరులో 9.2ఎం.ఎం, పగిడ్యాలో పాములపాడులో 8.4ఎం.ఎం, జూపాడుబంగ్లాలో 6.6ఎం.ఎం, మిడ్తూరులో 6.4 మి.మీ. ప్రకారం వర్షపాతం నమోదైనట్లు వివరించారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న బవనాసి వాగు

వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలి

నందికొట్కూరు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయం సీజనల్ వ్యాధులను అరికట్టాలంటూ సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ అనుపమకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ వర్షం కురినప్పుడల్లా రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తుందని, ఆ నీరు రోజుల తరబడి నిలిచిపోయి దోమలకు ఆవాసంగా మారుతున్నాయని, దీంతో ప్రజలు రోగాలకు గురవుతున్నారన్నారు. 60 వేల జనాభా కలిగిన పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని మండిపడ్డారు. 29 వార్డుల్లో బ్లీచింగ్ పౌడర్, ఫినాయిల్ మురుగు కాలవలను శుభ్రం చేయించాలని కోరారు. ఉపేంద్ర, భాస్కర్‌గౌడ్, కేశవగౌడ్, యాకోబు, మౌలాలి, సుధాకర్, స్వామి, మంగమ్మ, సాలమ్మ, లక్ష్మీదేవి, లక్ష్మమ్మ, వేలమ్మ పాల్గొన్నారు.

శివాలయాల్లో పూజలు

ఆత్మకూరు: పట్టణంలోని శివాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి పంచామృతాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, మంగళహారతి, సుప్రభాత సేవ విశేష పూజలు చేపట్టారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి పల్లకీసేవ జరిపించారు.

సమస్యలు తెలియజేయండి

జూపాడుబంగ్లా: ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజాసమస్యలు–పరిష్కార వేదిక లో ప్రజలు లిఖితపూర్వకంగా వారి సమస్యలను తెలియజేస్తే సత్వరమే పరిష్కరిస్తామని తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాసమస్యలు–పరిష్కారవేదిక కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. ఏపీడీ అన్వరాబేగం, ఎంపీడీఓ నూర్జహాన్, పీఆర్ ఏఈ బషీర్, తాగునీటి శాఖ నాగేంద్ర, హౌసింగ్ ఏఈ జ్యోతి, ఏఓ కృష్ణారెడ్డి, ఏపీఓ గౌరీబాయి, ఏపీఎం అంబమ్మ, ఎంఈఓ–2 శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి




ఏఎస్ఐకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: పాములపాడు మండలంలోని ఇస్కాల గ్రామానికి చెందిన లింగస్వామి అలియాస్ ఎర్రన్నను హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని రజక సంక్షేమ సంఘం మాజీ రాష్ట్ర నాయకుడు బస్తిపాటి మౌలాలి డిమాండ్ చేశారు. సోమవారం చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద రజకులపై జరుగుతున్న హత్యలు, దాడులు, అఘాయిత్యాలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఆళ్లగడ్డలో వారం క్రితం చాకలి శ్రీనుపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చటం, మూడు రోజుల క్రితం చాకలి లింగస్వామిని దారుణంగా హత్యచేయటం విచారకరమన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక రజకులపై హత్యలు, దాడులు పెరిగిపోయాయన్నారు. అనంతరం తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్, ఏఎస్ఐ మేరీ జయంతికి వినతిపత్రాలు అందజేశారు. ఎల్లయ్య, ఎల్ఐసీ మధు, పాములపాడు రామకృష్ణ, ఆనంద్, నాగన్న, నాగభూషణం, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, శేషమ్మ, లింగస్వామి పాల్గొన్నారు.

నందికొట్కూరు: చాకలి లింగస్వామిని హత్య చేసిన నిందితులను వెంటనే గుర్తించాలని రజక సంఘం అధ్యక్షుడు విజయకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని చాకలిపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా మృతుడి కుటుంబానికి ప్రభుత్వం రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, రెండు ఎకరాల భూమి ఇవ్వాలని కోరారు. నాయకులు సంజన్న, జయన్న, ఆంజనేయులు, శివ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడికి పల్లకీ సేవ

మహానంది: మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు మహానందీశ్వర ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. స్థానిక అలంకార మండపంలో గణపతి పూజ, అలంకార హారతులు చేసి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువు చేశారు. బలిహరణ పూజలు చేసిన అనంతరం ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది.



పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

రైతుల కుటుంబాలను ఆదుకోవాలి

వెలుగోడు : ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ కోరారు. ఈ మేరకు సోమవారం సచివాలయం సిబ్బందికి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలు అమలు చేసి వ్యవసాయానికి ప్రతి రైతు కుటుంబానికి రూ.20వేలు అకౌంట్‌లో జమ చేయాలని, కౌలు రైతులందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలన్నారు. మహమ్మద్‌రఫీ, రమణ, శివారెడ్డి, తరులు పాల్గొన్నారు.

మహానందిలో ఉద్యోగుల అంతర్గత బదిలీలు

మహానంది: మహానంది ఆలయంలో పని చేస్తున్న రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్, ఏజెన్సీ ఉద్యోగుల అంతర్గత బదిలీలు చేస్తూ ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం వివిధ విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగుల స్థానాలను మార్పులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం టెంపుల్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాసులు, మధ్యాహ్నం నుంచి టెంపుల్ ఇన్‌స్పెక్టర్‌గా శశిధర్‌రెడ్డిలను నియమించారు. వీరితో పాటు ప్రసాదాలు, వసతి గృహాలు, ఇతర విభాగాల ఉద్యోగులను మార్పు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

మోటార్లకు మరమ్మతులు చేస్తేనే సాగునీరు



మాట్లాడుతున్న ఇంజినీర్ సాంబశివుడు

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా ఎత్తిపోతల పథకం మోటార్లకు మరమ్మతులు నిర్వహిస్తేనే ఆయకట్టుకు సాగునీరు అందే పరిస్థితులున్నాయని పథకం టెక్నికల్ కమ్యూనికేషన్ ఇంజినీర్ సాంబశివుడు తెలిపారు. సోమవారం స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో 80బన్నూరు, పి.లింగాపురం, తంగడంచ, తరిగోపుల, పారుమంచాల పొలాలకు సాగునీటిని అందించేందుకుగాను ఆయకట్టు రైతుల సమావేశం నిర్వహించారు. సాంబశివుడు మాట్లాడుతూ జూపాడుబంగ్లా ఎత్తిపోతల పథకం–1, 2 లలో ఐదు మోటార్లు గురైనట్లు చెప్పారు. వీటికి మరమ్మతులు నిర్వహించాలంటే రూ.25 లక్షలు అవసరమవుతాయన్నారు. వాటిని ఆయకట్టు రైతులు పోగుచేసుకొని మరమ్మతులు చేయించుకోవాలన్నారు. అనంతరం శ్రీలక్ష్మీరంగనాయక స్వామి ఆయకట్టు దారుల నూతన కమిటీ గౌరవ అధ్యక్షునిగా గిరీశ్వరరెడ్డి, అధ్యక్షుడిగా జంగాలపెద్దన్న, ఉపాధ్యక్షునిగా మహేశ్వరరెడ్డి, కార్యదర్శి చాకలి శ్రీనివాసులు, కోశాధికారిగా రవికుమార్ యాదవ్, సహాయకార్యదర్శిగా షేక్‌సైఫుద్దీన్‌లతో పాటు 8మందిని సభ్యులుగా ఎన్నుకొన్నారు.

అక్రమంగా విద్యుత్ వినియోగం

జూపాడుబంగ్లా: నేషనల్ హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా రహదారి వెంట చేపట్టిన కల్వర్టులు, వంతెనల నిర్మాణం పనుల వద్ద పనుల నిమిత్తం కార్మికులు విద్యుత్ అవసరాలకు అక్రమంగా కొక్కేలు తగిలించి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారు. మండ్లెం వద్ద సుద్దవాగుపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణం పనులు చేస్తున్న కార్మికులు సమీపంలోని విద్యుత్ స్తంభానికి కొక్కేలు తగిలించి అక్రమంగా విద్యుత్‌ను వినియోగించుకొంటున్నారు. ఆ శాఖ అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



బాలికలను సంరక్షించుకోవాలి

మిడుతూరు: బాలికలను సంరక్షించుకోవలసిన బాధ్యత మన అందరిపై ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుకాదేవి అన్నారు. సోమవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థినులకు బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికలకు పౌష్టికాహారం, బ్యాడ్ టచ్, గుడ్ టచ్, బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, విద్య– ఆరోగ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

రోడ్లను బాగు చేయండి

కొత్తపల్లి: ఆత్మకూరు నుంచి దుద్యాల వరకు, దుద్యాల నుంచి ఇస్కాల రోడ్లు గుంతల మయంగా మారాయని సత్వరమే బాగు చేసి ప్రయాణ కష్టాలు తీర్చాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు రాజు, మండల అధ్యక్షుడు మద్దిలేటి కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ తిరుపతయ్యకు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ రోడ్లు గుంతల మయంగా మారి ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని, స్పందించి వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. ఇస్కాల, చెలిమిల్ల నాగంపల్లి. కొక్కెరంచ, ఎదురు పాడు జడ్డువారిపల్లె, కొత్తమాడుగుల, లింగాల గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తారని చెప్పారు. తహసీల్దార్ స్పందిస్తూ.. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. నాగరాజు, నాగన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.